

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, సెప్టెంబర్ 24 : వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 52 పోస్టులు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ తెలిపారు. ఈ నెల 27, 28, 30వ తేదీలలో కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎంసీ వికారాబాద్.ఓఆర్జీ వెబ్‌సైట్‌ను చూసుకోవాలని తెలిపారు.

రుణాల కోసం పడిగాపులు



దోమ ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట రైతుల క్యూ

ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రైతు రుణమాఫీ జరిగిన రైతులు నూతన రుణాలు తీసుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. దోమ మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకు ఎదుట మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు కొత్త రుణాల కోసం బారులు తీరారు. బ్యాంకులో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకులో సిబ్బందిని నియమించి ఇబ్బందులు లేకుండా కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరారు.

- దోమ, సెప్టెంబరు 24

రాష్ట్రపతి రాకతో పకడ్బందీ ఏర్పాట్లు

» మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయుచున్న భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము కార్యక్రమానికి అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారంకలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిధిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేయుచున్నారని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. శనివారం రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో హకీంపేట ఏయిర్‌పోర్టుకు చేరుకుంటారన్నారు. నల్సార్ యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతీ విభాగానికి ఒక అధికారిని నియమిస్తూ ఏర్పాట్లు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కీసర ఆర్డీఓకు సూచించారు. రోడ్ల మరమ్మతులు, రెడ్ కార్పెట్లు, నిరంతర విద్యుత్ సరఫరా, పుష్పాలంకరణ, వైద్య శిబిరాలు, అంబులెన్స్, సీటింగ్, మొబైల్ టాయిలెట్స్, పాసులు వంటి ఏర్పాట్లు సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, ఆర్ అండ్ బీ జిల్లా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్




ఇష్టమైన కూరతో కడుపు నిండా భోజనం చేద్దామనుకునే వారికి ఇది నిజంగా చేదు వార్తే. ఇష్టమైన కూరగాయలు దొరకడం ఇక కష్టమే. ఒకవేళ దొరికినా వాటిని కొనే పరిస్థితి ఉండకపోవచ్చు. కూరగాయల కోసం అంత కష్టం ఏముస్తుంది అనుకుంటున్నారా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నానాటికి కాయగూరల సాగు విస్తీర్ణం భారీగా పడిపోతోంది. ఉత్పత్తులు భయంకరంగా తగ్గుతున్నాయి. కేవలం ఐదేళ్లలోనే 40 వేల ఎకరాల్లో సాగు తగ్గిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూరగాయల సాగుకు సర్కారు సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడం, పట్టణీకరణ పెరుగుతుండడమే దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

- గడిచిన ఐదేళ్లలో 40వేల ఎకరాల్లో తగ్గుదల
- గణనీయంగా పడిపోయిన ఉత్పత్తులు
- నగర వాసుల అవసరాలకు బయట నుంచే అధిక సరఫరా
- శివార్లలో పట్టణీకరణ కూడా కారణం
- ఉద్యాన జోన్‌పై కాంగ్రెస్ సర్కార్ మౌనం

కూరగాయాలే!

ఉమ్మడి జిల్లాలో భారీగా తగ్గుతున్న కూరగాయల సాగు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా/వికారాబాద్/మేడ్చల్ ప్రతినిధి)


హైదరాబాద్ మహానగరానికి అవసరమైన కూరగాయలను అధిక శాతం సమకూర్చే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో క్రమేపీ కూరగాయ పంటల సాగు తగ్గిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గడిచిన అయిదేళ్లలో దాదాపు 40వేల ఎకరాల్లో కూరగాయ పంటలు సాగు తగ్గడం గమనార్హం. పట్టణీకరణ నేపథ్యంలో నగర శివార్లలో ఉద్యాన పంటలు సాగు చేసే భూములన్నీ కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. దీనికి తోడు వెజిటబుల్ హబ్‌గా ఉన్న ఈ ప్రాంతంలో కూరగాయలు పండించే రైతులకు సరైన ప్రోత్సాహకం లభించడం లేదు. దీంతో కూరగాయ పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న ఉమ్మడి జిల్లాలో అన్ని సీజన్‌లోనూ కూరగాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ, మొయినాబాద్, చేవెళ్ల, మర్పల్లి, పరిగి, శంకరపల్లి, మేడ్చల్, శామీర్‌పేట, కీసర తదితర ప్రాంతాల రైతులు ఎక్కువగా కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. వీరంతా పండించిన పంటను హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లకు, రైతు బజార్లకు తరలిస్తున్నారు. అయితే గడిచిన అయిదేళ్లలో ఈ ప్రాంతాల్లో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కూడా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ మంది పత్తి పంట వేస్తున్నారు. శివార్లలో ప్రతి ఏటా కూరగాయలు సాగు తగ్గిపోతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి నగరానికి కూరగాయలు సరఫరా అవుతున్నాయి. గతంలో శివార్లలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ఉద్యాన జోన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్, టీఆర్ఎస్ ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. కానీ ఇంత వరకు దీనిపై ఎలాంటి కదలికా లేదు. కనీసం ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు ఇచ్చినా ఈ ప్రాంతంలో కూరగాయల సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ వాతావరణ పరిస్థితులు కూడా ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉద్యాన ప్రణాళికలు రూపొందించి శివార్లలోని కొన్ని గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన రైతులతో కూరగాయ పంటలు సాగు చేయించారు. విత్తన సబ్సిడీలు కూడా ఇచ్చారు. అయితే తరువాత ఈ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. పాలీహౌజ్, నెట్‌హౌజ్‌లకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు కూడా గతంలోలాగా అందడం లేదు. దరఖాస్తు చేసుకొని ఏళ్ల తరబడి వీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.


బ్యాంకుల నుంచి అందని రుణాలు


కూరగాయలు పండించే రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు కూడా అంతంత మాత్రంగానే అందుతున్నాయి. వివిధ పంటల సాగుకోసం బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) కూడా పెంచడం లేదు. ఆర్‌బీఐ కూడా రైతులకు తీపి కబురు చెప్పింది. ప్రభుత్వం ప్రతి ఏటా వ్యవసాయ రుణ పరిమితి పెంచుతున్నప్పటికీ రైతులకు ఆ మేర బ్యాంకుల నుంచి రుణాలు అందడం లేదు. రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రైతులకు రుణాలు ఇచ్చేందుకు ప్రతి ఏటా బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించినప్పటికీ ఆ మేరకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదు. ఎలాంటి హామీ, పూచీకత్తు అవసరం లేకుండా రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ఆర్‌బీఐ ఇచ్చిన ఆదేశాలు కూడా అమలు కావడం లేదు.




కూరగాయ పంటల సాగు (ఎకరాల్లో)













కూరగాయల ఉత్పత్తులు (టన్నుల్లో)









దంచికొట్టిన వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం

- నిలిచిపోయిన రాకపోకలు
- లోతుకుంట చెరువుకట్టకు బుంగ
- కొట్టుకుపోయిన రూ.లక్షల విలువైన చేపలు
- పిడుగులు పడి మూడు ఆవులు మృత్యువాత
- అత్యధికంగా సరూర్‌నగర్‌లో 89.5 మి.మీ వర్షపాతం నమోదు



కొందుర్గు- ఎంకిర్యాల మధ్య తెగిన రోడ్డు

ఆంధ్రజ్యోతి, ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, సెప్టెంబరు24 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో అత్యధికంగా 89.5మి.మీ వర్షపాతం నమోదు కాగా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో 85.3మి.మీ వర్షపాతం నమోదైంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటివనంలో 77.8మి.మీ, కడ్తాలలో 72.5మి.మీ, శంకర్‌పల్లి 66.8మి.మీ, షాబాద్ మండలం చందనవెల్లిలో 59.3మి.మీవర్షపాతం నమోదైంది. మేడ్చల్ - మల్కాజిరిగి జిల్లా దుండిగల్‌లో 79.8మి.మీ, ఉప్పల్ మండలం బండ్లగూడలో 77.3మి.మీ, రామంతాపూర్‌లో 52.0మి.మీ, వికారాబాద్ జిల్లా నవాబుపేటలో అత్యధికంగా 64.0మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే ధారూరులో 37.0మి.మీ, మర్పల్లిలో 34.0మి.మీ, యాలాలలో 33.3మి.మీ, పుట్టపహాడ్‌లో 30.5మి.మీ, పెద్ద ఉమ్మెంతాల్‌లో 28.3మి.మీ, వికారాబాద్‌లో 27.0మి.మీ వర్షపాతం నమోదైంది.

రహదారులు జలమయం

మేడ్చల్ జిల్లా నాగారం, మేడ్చల్ పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం కురిసన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా బీఎంఆర్ ఎన్‌క్లేవ్, సాయినగర్, సాయిసంజీవనగర్ కాలనీల్లోని

మిగతా 7వ పేజీలో...

పిడుగుపాటుకు మూడు ఆవులు మృతి

యాచారం మండలం కిషన్‌పల్లి గ్రామంలో పిడుగుపడి రెండు ఆవులు చనిపోయాయి. సోమవారం సాయంత్రం నర్సింహ తన పొలం వద్ద చెట్టు కింద ఆవులను కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. కాగా రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పడడంతో రెండు ఆవులు మృతి చెందాయి. మంగళవారం ఉదయం పాలు పితకడానికి వెళ్లగా రెండు ఆవులు చనిపోవడంతో రైతు రోదించాడు. అలాగే కొందుర్గు మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన గొల్ల లింగానికి చెందిన ఆవు పిడుగుపడి మృత్యువాత పడింది.



మేడ్చల్‌లో వాననీటిలో మునిగిన వాహనాలు

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 24: చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఆకార్, ఆశ స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం బొంరాస్‌పేట్‌లోని రైతు వేదికలో ఆరేళ్ల చిన్నారుల వరకూ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వారిలో మానసిక, అంగవైకల్యం లాంటి రుగ్మతలను గుర్తించేందుకు చేపట్టిన పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. 3,825 మంది చిన్నారుల్లో వివిధ రుగ్మతలు ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ రైతు వేదికలో జిల్లా వైద్య సిబ్బందితో పాటు ఆర్‌బీఎస్‌కే, స్వచ్ఛందసంస్థ వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించింది. అందులో 350 మంది హైరిస్క్ ఉన్నవారిగా గుర్తించారు. మరో 38 మందికి అంగవైకల్యం ఉన్నట్లు నిర్ధారించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. అంగవైకల్యం సమస్యలు తెలుసుకుంటూ వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.

రుణమాఫీ కాని వారు అధైర్యపడొద్దు

కలెక్టర్ బొంరాస్‌పేట్‌కు వస్తున్న విషయం తెలుసుకున్న ఎన్కెపల్లి గ్రామ రైతులతో పాటు మరికొంత మంది రైతులు రైతు వేదిక దగ్గరికి చేరుకొని కలెక్టర్‌తో తమ ఆవేదన తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ మట్లాడారు. రుణమాఫీ కానివారు అధైర్యపడొద్దని, అర్హులైన వారందరికీ రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు కుటుంబాల గుర్తింపు, ఇతర కారణాలతో రుణమాఫీలో ఆలస్యం జరిగిందన్నారు. రుణమాఫీ వివిధ కారణాలతో కానివారి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రవీంద్రయాదవ్, స్థానిక వైద్యులు హేమంత్ కుమార్, తహసీల్దార్ పద్మావతి, ఇంచార్జ్ ఎంపీడీవో వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఈనెల 27న బ్రహ్మాండమైన విడుదల

సర్దుబాటు

సర్కారు బడుల్లో చదువులు గాడిన పెట్టడంపై విద్యాశాఖ దృష్టిసారించింది. పాఠశాలలు ప్రారంభమైన కొద్దిరోజులకే ఉపాధ్యాయుల సర్దుబాటు జరగాలి. కానీ విద్యా సంవత్సరం సగం పూర్తయినా ఈ ప్రక్రియ ముందడుగు పడలేదు. ఎట్టకేలకు ఈనెల 20న దీనిపై ఉత్వర్వులు జారీ కావడంతో టీచర్ల సర్దుబాటుపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. విద్యార్థుల సంఖ్య, స్థానిక పరిస్థితులను బట్టి టీచర్లను నియమించేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

- విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఏర్పాటు
- తాత్కాలిక సర్దుబాటుపై కసరత్తు
- వివరాలు సేకరిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): జిల్లాలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ మొదలైంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో 1-10 మంది విద్యార్థులుంటే ఒక ఉపాధ్యాయుడు, 11-60 మంది ఉంటే ఇద్దరు, 61-90 మంది ఉంటే ముగ్గురు, 91-120 మంది విద్యార్థులుంటే నలుగురు ఉపాధ్యాయులు, 121-105 మంది విద్యార్థులుంటే ఐదుగురు ఉపాధ్యాయులు, 153-200 మంది విద్యార్థులు ఉంటే ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియమించనున్నారు. గతానికి భిన్నంగా మండలాల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. ఇంతకుముందు కౌన్సెలింగ్ కోసం ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఈ సారి మండల స్థాయిలోనే ఈ ప్రక్రియ కొనసాగనుంది. పాఠశాలల వారీగా ఎక్కడెక్కడ ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు? ఎక్కడ అదనంగా ఉన్నారనే వివరాలు ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యాశాఖ అధికారులు తెప్పించుకుంటున్నారు. దీనికి సంబంధించి సోమవారం కలెక్టరేట్‌లో డీఈవో ఆధ్వర్యంలో మండల విద్యాధికారులతో కలెక్టర్ శశాంక సమావేశాన్ని నిర్వహించారు. సర్దుబాటులో భాగంగా స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను ముందుగా సర్దుబాటు చేయనున్నారు. తర్వాత ఎస్జీటీలను సర్దుబాటు చేస్తారు. మండల స్థాయిలో కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత డివిజన్ స్థాయిలో చేపట్టనున్నారు. జిల్లాలో 1,342 పాఠశాలలు ఉన్నాయి. 6,526 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా 6,007 మంది పని చేస్తున్నారు. 519 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పారదర్శకంగా జరిగేనా?

సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఇతర ప్రాంతాలకు దూరంగా వెళ్లిన ఉపాధ్యాయులు వారికి అనుకూలంగా ఉన్న చోటుకు వెళ్లేందుకు పైరవీలు మొదలు పెట్టారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో తొలుత కాంప్లెక్స్ పాఠశాల పరిధిలోని స్కూళ్లలో ఉపాధ్యాయుల అవసరం ఉంటే అదే కాంప్లెక్స్ పరిధిలో అదనంగా ఉన్నవారిని సర్దుబాటు చేయాలి. ఆ కాంప్లెక్ పరిధిలో అదనపు ఉపాధ్యాయులు లేకుంటే మండల పరిధి నుంచి సర్దుబాటు చేయాలి. మండలంలో అందుబాటులో లేకుంటే పక్క మండలాల నుంచి, చివరగా జిల్లా యూనిట్‌గా తీసుకుని ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే వెసులుబాటు రాష్ట్ర విద్యాశాఖ కల్పించింది. అయితే దీన్ని అవకాశంగా తీసుకున్న పలువురు ఎంఈవోలు, ఉపాధ్యాయులు వారికి అనుకూలమైన ప్రాంతాలకు వచ్చేందుకు పైరవీలు ప్రారంభించారు.

వీరికి మినహాయింపు

70 శాతం కంటే ఎక్కువ శారీరక వైకల్యం కలిగిన దివ్యాంగులు, వచ్చే మే నెలాఖరులోగా ఉద్యోగ విరమణ చేయనున్న వారికి, అవివాహిత యువతులు, వితంతు, ఒంటరి మహిళలకూ సర్దుబాటు ప్రక్రియలో మినహాయింపు ఇవ్వనున్నారు. మానసిక సమస్యలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే పిల్లలను కలిగిన వారి స్థానంలో అదే పాఠశాలల్లో మరొకరిని సర్దుబాటుచేసేలా కసరత్తు చేస్తున్నారు.

టీచర్లను త్వరలోనే సర్దుబాటు చేస్తాం



విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాం. ఇం దుకు సంబంధించి కలెక్టర్ శశాంక ఎంఈవోలతో సమా వేశాన్ని నిర్వహించారు. పాఠశాలల వారీగా ఎక్కడెక్కడ ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు? ఎక్కడ అదనంగా ఉన్నారనే వివరాలు ప్రధానోపాధ్యాయుల ద్వారా తెప్పించు కుంటున్నారు. ఎంత మంది అదనంగా ఉపాధ్యాయులు ఉన్నారనే విషయంపై నాలుగు రోజుల్లో స్పష్టత రానుంది.

- సుశీందర్‌రావు, డీఈవో

పీఎస్/యూపీఎస్ స్కూళ్లలో ఉపాధ్యాయులు సర్దుబాటు ఇలా

విద్యార్థులు	టీచర్లు				
1-10	1	281-310	10	641-670	23
11-60	2	311-340	12	671-700	24
61-90	3	341-370	13	701-730	25
91-120	4	371-400	14	731-760	26
121-105	5	401-430	15	761-790	27
153-200	6	431-460	16	791-820	28
ఉన్నత పాఠశాలలో..		461-490	17	821-850	29
220	7	491-520	18	851-880	30
221-250	8	521-550	19	881-910	31
251-280	9	551-610	20	911-940	32
		661-640	22	941-970	33
				971-1000	34

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలి : ఏసీపీ



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 24 : ప్రతీఒక్కరు రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కలిగి ఉండాలని బేగంపేట టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు తెలిపారు. మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పోలీస్ ట్రైనింగ్ కాలేజీ విద్యార్థులకు రోడ్డు భద్రత పట్ల ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పౌరులందరూ రోడ్డు భద్రతా నియమాలకు కట్టుబడినప్పుడే ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. ట్రైనింగ్ పూర్తి చేసుకుని ఉద్యోగం చేసేవారు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనీ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, 300 మంది పోలీస్ ట్రైనీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు కృషి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

షాబాద్, సెప్టెంబరు 24 : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సిబ్బందికి, వాటర్‌మెన్‌లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేడు ఎన్నో ఆధునిక సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, వాటిపై వాటర్‌మెన్‌లు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. టెక్నికల్ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. నీటి సంపులు, గేట్‌వాల్స్ ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాజేశ్వర్‌రావు, డీఈ హారిక, ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆమనగల్లు, సెప్టెంబరు 24: ఆహారంలో నిత్యం చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక రోగాలు చాలావరకు దరిచేరవని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెక్టార్ స్థాయి పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. శాంతిరేఖ, మెడికలాఫీసర్ మంజులాదేవిలు హాజరై పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సర్వే పూర్తి చేయాలి



తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న డీసీఈవో హరిసింగ్

మహేశ్వరం, సెప్టెంబరు 24 : ఓటరు జాబితా సవరణలపై ఈనెల 26వ తేదీ లోపు సంబంధిత అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే పూర్తిచేయాలని ఎన్నికల కమిషన్ డీసీఈవో హరిసింగ్ సూచించారు. ఓటరు జాబితా సవరణపై సోమవారం బాలాపూర్‌లో మహేశ్వరం, కందుకూరు, సరూర్‌నగర్ మండలాల తహసీల్దార్లు, మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్లతో డీసీఈవో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు మహేశ్వరం నియోజకవర్గం అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సైదులు తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మణ్

చేవెళ్ల, సెప్టెంబరు 24 : రసాయనిక ఎరువులు వాడటం మూలంగా భూమిలో సారం తగ్గడంతోపాటు కాలుష్యం పెరిగిపోతుందని, వాటి వాడకం తగ్గించాలని తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త టి.లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు భూసార పరీక్షలు, ఎరువుల యాజమన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నేల సారవంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, యాజమన్య పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ సురేష్, ఏవో శంకర్‌లాల్, ఏఈవో బాలకోటేశ్వర్‌రావు, స్వాతిప్రియ, రమ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మొయినాబాద్, సెప్టెంబరు 24: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఎంపీడీవో సంధ్య, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, నాయకులు ఎన్.మహేందర్ ముదిరాజ్, రేనట్ల రాజుగౌడ్, భిక్షపతి, కె.యాదయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే సంక్షేమ పథకాల నిలుపుదల



లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలె యాదయ్య

పెద్దేముల్, సెప్టెంబరు 24 : మారుతున్న కాలానికి అనుగుణంగా మనం కూడా మారాలని, నేరాలకు పాల్పడితే ప్రభుత్వ పథకాలు నిలిపివేసేందుకు చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని నెల్లిగడ్డతండాలో గిరిజనులకు నాటుసారా తయారీ, విక్రయాలు నేరమనే విషయంపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు, నేరచరిత్ర కలిగిన ముద్దాయిలను తహసీల్దారు ఎదుట బైండోవర్ చేస్తామన్నారు. నిబంధనలు, రూల్స్ ఉల్లంఘించిన వారికి రూ.2లక్షల జరిమానా లేదా ఒక సంవత్సరం జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



శంకర్‌పల్లి నుంచి హైదరాబాద్ వెళ్లేదారిలో అనన్య హోటల్ వద్ద ఇటీవల డ్రైనేజీ కాలువ నిర్మించారు. అయితే, మున్సిపల్ అధికారులు దానిపై కప్పు వేయలేదు. దాంతో ప్రమాదకరంగా మారింది. ఈక్రమంలో మంగళవారం వర్షం కురుసింది. ఓ వ్యక్తి అటుగా వెళ్తుండగా బైక్ అదుపుతప్పి అందులో పడిపోయాడు. పెద్దగా గాయాలు కాకపోవడంతో అతడు నెమ్మదిగా పైకి చేరుకున్నాడు. అధికారులు వెంటనే పైకప్పు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- శంకర్‌పల్లి, సెప్టెంబరు 24

దంచికొట్టిన వాన

(5వ పేజీ తరువాయి)

రోడ్లు చెరువులను తలపించాయి. రాంపల్లి చౌరస్తాలోని విశాల్ మార్కెట్ వద్ద రెండు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. ఎగువ ప్రాంతాలైన జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు, దమ్మాయిగూడ నుంచి పెద్ద ఎత్తున వరదనీరు రావడంతో రాకపోకలు నిలిచి ట్రాఫిక్ జామ్ అయ్యింది. దాదాపు మూడు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మేడ్చల్ పట్టణంలో భారీ వర్షం కారణంగా జనజీవనం అతాలకుతలమైంది. ఎన్‌జీఓ కాలనీలో ఖాళీ పాట్లలో వర్షం నీరు చేరి అక్కడ పార్కింగ్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు నీటమునిగాయి. పోలీస్‌స్టేషన్ వద్ద వరదనీరు నిలవడంతో రాక పోకలు నిలిచిపోయాయి. దీంతో కౌన్సిలర్ ఉమానాగరాజు మున్సిపల్ సిబ్బందితో నీటిని తొలగించారు. వికారాబాద్ పట్టణంలో రోడ్లపై వర్షం నీరు నిలిచింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్, ఇమాంగూడ, శ్రీనగర్, తుక్కుగూడ, సర్దార్‌నగర్, హర్షగూడ గ్రామాలల్లో భారీ వర్షం కురిసింది. వర్షానికి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో బ్రిడ్జిల వద్ద వరదనీరు నిలవడంతో మంఖాల్, హర్షగూడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శంకర్‌పల్లి పట్టణంతో పాటు మండలం పరిధిలో గంటన్నర పాటు జోరుగా వాన పడడంతో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తమతమ గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.



కిషన్‌పల్లిలో పిడుగుపడి మృతి చెందిన పాడి ఆవులు

లోతుకుంట చెరువుకట్టకు బుంగ

రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు అంకుశాపూర్‌లోని లోతుకుంట చెరువుకట్టకు బుంగ ఏర్పడి నీరంత వృథాగా పోయింది. చెరువులోని చేపలన్నీ కిందికి వెళ్లిపోయాయి. మత్స్యకారులు గడ్డివాముతో పాటు మట్టితెప్పలు వేసి మరమతులు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఇరిగేషన్ ఏఈ పరమేష్‌కు సమాచారం అందించారు. ఏఈ సంఘటన స్థలానికి చేరుకోని జేసీబీతో సిమెంట్ బస్తాల్లో డస్ట్ నింపి ఫిల్లింగ్ చేయించారు. దాదాపు నాలుగున్నర లక్షల విలువ చేసే చేపలు కిందికి వెళ్లిపోయాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.



భారీ వర్షానికి కూలిన ఇల్లు

తెగిపోయిన ఎంకిర్యాల రోడ్డు

కొందుర్గు మండల పరిధిలోని ఎంకిర్యాల-తంగళ్లపల్లి మధ్యలో నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్డు మళ్లీ తెగిపోయింది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నవాబుపేట్- కొందర్గుకు మధ్యలో ఉన్న ఎంకిర్యాల వాగు తెగిపోవడంతో ఆగిర్యాల, ఎంకిర్యాల, కాస్లాబాద్, కాస్లాబాద్‌తండా తదితర గ్రామాలకు రాకపోకలు నిలిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కేశంపేట మండలం సంగెం గ్రామంలో తూర్పు పాటి మల్లయ్య పెంకుటిల్లు కూలింది.

110 ఎకరాల్లో అర్బన్ పార్కు

- అంతారం అటవీ భూముల్లో ఏర్పాటుకు చర్యలు
- పనులు వేగిరం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశం



అర్బన్ పార్కు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, సెప్టెంబరు 24 : 110 ఎకరాల అటవీ భూముల్లో నిర్మించనున్న అర్బన్ పార్కు పనులను వేగవంతం చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తాండూరు డివిజన్ అటవీ శాఖ అధికారులతో కలిసి అభివృద్ధి పనులు, భూ సమస్యలపై సమీక్షించారు. తాండూరు మండలం అంతారం గ్రామ శివారులో నిర్మించే అర్బన్ పార్కు నమూనా చిత్రాన్ని(మ్యాప్) పరిశీలించారు. ఈ పార్కులో ఏర్పాటు చేయబోయే వాచ్‌మెన్, యోగా షెడ్, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లేగార్డెన్‌తో పాటు ఇతర పనులన్నింటినీ త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ స్థాయిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే క్లియర్ చేయిస్తానని, ఈ విషయంలో అధికారులు శ్రద్ధ తీసుకుని పనులు సకాలంలో పూర్తిచేసేలా చొరవ తీసుకోవాలన్నారు. బషీరాబాద్ మండలం మైల్వార్, జలాల్‌పూర్, నీళ్లపల్లి గ్రామ శివారులో ఉన్న సరిహద్దు అటవీ భూముల సమస్యలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తాండూరు ఎఫ్ఆర్వో రాజేందర్, ఎఫ్ఎస్‌వో ఇన్‌చార్జి పీర్యానాయక్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి



మహేష్ కుమార్‌గౌడ్‌తో తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 24 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవడంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈమేరకు మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మంగళవారం మహేష్‌కుమార్‌ను నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తీగల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు రానున్న ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ కైవసం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని మహేష్‌కుమార్ సూచించినట్లు తెలిపారు. పల్లె పాండుగౌడ్, రవిగౌడ్, జంగయ్యగౌడ్, సత్యనారాయణ, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్‌ను షాద్‌నగర్ వరకు పొడిగించాలి



డీకే అరుణకు వినతిపత్రం ఇస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్, సెప్టెంబరు 24: ఎంఎంటీఎస్ రైలును షాద్‌నగర్ వరకు పొడిగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మహబూబ్‌నగర్‌లో ఎంపీ డీకే అరుణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి శంషాబాద్ వరకు నడుస్తున్న ఎంఎంటీఎస్ రైలును షాద్‌నగర్ వరకు పొడిగిస్తే చిరువ్యాపారులు, ఉద్యోగస్థులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైలును హైదరాబాద్‌లోని మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో ఆపితే షాద్‌నగర్‌కు వచ్చే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎన్‌హెచ్ 44 మీదుగా వెళ్లే బస్సులను షాద్‌నగర్‌లో నిలపడంలేదని, రైళ్లను అందుబాటులోకి తేవాలని కోరారు. బీజేపీ సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, చేగు సుధాకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ

తిరుమల లడ్డూ కల్తీపై హిందూ సంఘాల నిరసన

తాండూరు, సెప్టెంబరు 24: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును వాడి అపవిత్రం చేయడంపై తాండూరులో హిందూ సంఘాలు మండిపడ్డాయి. ఈ ఘటనకు సంబంధించిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హిందూ వాహిని, వీహెచ్‌పీ, తెలంగాణ సాధు పరిషత్, గీతా సత్సంగ్ సేవా సమితిల ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. భద్రేశ్వర్ స్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమై గాంధీ చౌక్, మర్రిచెట్టు కూడలి, గంజ్ మార్కెట్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు చేరుకొని, ఇందిరాచౌక్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలొద్దంటూ నినాదాలు చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని శిక్షించాలంటూ సంఘాల ప్రతినిధులు పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఇందిరాచౌక్‌లో మానవహారం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు, బీజేపీ నాయకులు కృష్ణ ముదిరాజ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం, సమితి సంఘాల ప్రతినిధులు విజయలక్ష్మీ, చల్లా నారాయణ, దేవగారి రమేష్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 : వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మినిష్టర్స్ క్వార్టర్స్‌లో ఆయన జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. వైద్యులు, సహాయక సిబ్బంది సెలవులు తీసుకోకుండా హెల్త్‌సెంటర్లు, ఆసుపత్రుల్లో రోజంతా అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దోమలు విజృంభించి ప్రతీ ఇంట్లో ఒకరు జ్వరం పాలయ్యారని తెలిపారు. ప్రధానంగా అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, సంచార వైద్యశాలలు ప్రతీ గ్రామానికి వెళ్లేలా చూడాలని ఆదేశించారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్థుల వివరాలు సేకరించి దగ్గర్లోని ఆసుపత్రికి తరలించేలా వైద్యాధికారులతో సమన్వయం కొనసాగించాలన్నారు. పసి పిల్లలు, గర్భిణీలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. డెంగీ, చికెన్‌గున్యాలకు కారణమయ్యే దోమల నియంత్రణకు యాంటీ లార్వల్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్యారోగ్య అధికారి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

తలకొండపల్లి, సెప్టెంబరు 24: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వైద్యారోగ్య శాఖపై మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అధికారులకు సూచించారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో ప్రభుత్వాసుపత్రిని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ శ్రీనివాస మూర్తి, మాజీ ఉపసర్పంచ్‌లు వి.నర్సింహులు, అజీజ్‌ల ఆధ్వర్యంలో గ్రామ నాయకులు వినతిపత్రమందజేశారు. ఆసుపత్రి ఏర్పాటుతో 15గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలపగా సీఎం దృష్టికి తీసుకెళతానని కసిరెడ్డి చెప్పారు.

తాత్కాలిక మండల విద్యాధికారులు

- ఎంఈవోలు లేని మండలాలకు నోడల్ అధికారులు..
- అదనపు బాధ్యతల నుంచి ఎఫ్ఏసీ ఎంఈవోలకు విముక్తి
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్య డైరెక్టర్

వికారాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పనితీరు మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండల విద్యాధికారులు లేక గాడి తప్పిన పాఠశాలలపై ఆజమాయిషీ పెంచేందుకు జిల్లాలోని అన్ని మండలాలకు పూర్తి అదనపు బాధ్యతలు కలిగిన మండల విద్యాధికారులు, మండల నోడల్ అధికారులను నియమిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఇదివరకే మండల విద్యాధికారులుగా కొనసాగుతున్న వారిని ఎంఈవోలు (ఎఫ్ఏసీ)గా యథాతథంగా కొనసాగిస్తూ.. ఎంఈవోలు లేని మండలాలకు మండల నోడల్ అధికారులను నియమించారు. మండలాల్లో సీనియర్ జీహెచ్‌ఎంలను మండల నోడల్ అధికారులుగా నియమించారు. బంట్వారం, బషీరాబాద్, బొంరాస్‌పేట్, చౌడాపూర్, ధారూరు, దోమ, దౌల్తాబాద్, దుద్యాల్, కొడంగల్, మర్పల్లి, మోమిన్‌పేట్ పరిగి, పెద్దేముల్, పూడూరు మండలాలకు మండల నోడల్ అధికారులను నియమించగా, మిగతా మండలాలకు ఎంఈవోలు కొనసాగనున్నారు. ఎఫ్ఏసీ ఎంఈవోలుగా కొనసాగుతున్న వారిని కొనసాగిస్తూ నియమించారు.

వర్తించని రైతు రుణమాఫీ



మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 24 : రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రుణమాఫీ అందక అన్నదాతలు ఇబ్బందుల్లో పడుతున్నారని బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి ఏఎంసీ మాజీ డైరెక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్‌లో మంగళవారం అయన విలేకరులతో మాట్లాడుతూ ఘట్‌కేసర్ మండలంలో రైతు సేవా సహకార బ్యాంక్ నుంచి 1,230 మంది, కమర్షియల్ బ్యాంక్‌ల నుంచి 71 మంది పంట రుణాలు తీసుకున్నారు. కమర్షియల్ బ్యాంక్‌లో తీసుకున్న రైతులకు రుణమాఫీ జరిగింది కానీ, రైతు సేవా సహకార సంఘంలో తీసుకున్న వారికి మాత్రం మాఫీ కాకపోడంలో ఆంతర్యమేమిటన్నారు. రూ.లక్ష వరకు 907 మంది, లక్షన్నర వరకు 201 మంది, రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న రైతులు 122 మంది ఉన్నారని, అందులోనూ 41 మంది రైతులు రుణమాఫీకి అర్హత లేదని అధికారులు ధ్రువీకరించారని పేర్కొన్నారు. నేడు ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసి నిరసన వ్యక్తం చేయాలని రైతులను కోరారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు: డీఏవో

ధారూరు, సెప్టెంబరు 24 : అర్హులైన రైతులందరికి తప్పనిసరిగా రుణమాఫీ అవుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. ధారూరు రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రుణమాఫీలో సమస్యలను అధికారులు పరిష్కరిస్తున్నారని, ఏవైనా సమస్యలుంటే ఏఈవోలకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తారని చెప్పారు. రైతుభరోసా మార్గదర్శకాలు ప్రకటించిన తర్వాత ప్రభుత్వం రైతుల ఖాతాలో పెట్టుబడి సాయం జమ చేస్తుందని వివరించారు. పంటల దిగుబడి, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూచనలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నోడల్ అధికారి సంజూరాథోడ్, ఏఈవోలు సంతోష్, మంజుల, సుజాత, రైతులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాటాలే మార్గం

శంషాబాద్, సెప్టెంబరు 24 : కార్మికులు తమ హక్కులు సాధించుకోవడానికి పోరాటాలే ఏకైక మార్గం అని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎన్నో కార్మిక హక్కులను ప్రధాని మోదీ ప్రభుత్వం కాలరాసిందని, వాటిని తిరిగి పొందడానికి కార్మికులకు సమరశీల పోరాటాలు చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు నేటి సమాజానికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు సీతారామయ్య, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌పావనీసింగ్, నర్సింగ్‌రావు, పల్లా దేవేందర్‌రెడ్డి, ఓరుగంటి యాదయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో నేర్చుకున్న విషయాలు సర్వీస్‌లో ఉపయోగపడుతాయి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 24: శిక్షణా కాలంలో నేర్చుకున్న విషయాలు సర్వీస్ మొత్తం ఉపయోగపడుతాయని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న17 మంది సబ్ ఇన్‌స్పెక్టర్ పోలీస్ అధికారులు జిల్లా పోలీస్ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అధికారులు చేయాల్సిన, చేయకూడని పనులను గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు సమయ పాలన, క్రమశిక్షణ పాటించాలని, ప్రజలకు సేవ చేయడానికి పోలీస్‌శాఖలో ఉద్యోగం రావడం మంచి విషయమని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతీ ఒక్కరు పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు.

లారీని ఢీకొన్న కారు.. ఇద్దరు దుర్మరణం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 24 : లారీని కారు వెనుకాల నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా, ఎడ్లపాడు మండలం, ఉన్నవ గ్రామానికి చెందిన ఇడుపులపాటి సురేష్ (35), అతని బంధువు సామినేని రాఘవరావు(45) అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు కాకమాను అమ్మయ్య, రమేష్‌లు కారు(ఏపీ 16 డీజీ 2178)లో ఈనెల 22న నిజామాబాద్ జిల్లా, వర్ని మండలం, ఫైడియాల్‌కు వెళ్లారు. అక్కడ సురేష్ తన భూమికి సంబంధించిన పనులు ముగించుకొని తిరిగి 23న సోమవారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి ఓఆర్ఆర్‌పై ఎగ్జిట్ నెంబర్ 9 సమీపానికి రాగానే కారు ముందు వెళుతున్న లారీ(ఏపీ 39వీటీ 4329)ని ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న సురేష్ అతని బంధువు రాఘవరావుల తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు అమ్మయ్య, రమేష్‌లకు స్వల్పగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. సురేష్, రాఘవరావు మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కక్షపూరితంగా బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 24: మర్పల్లి ఎస్ఐ సురేష్ కక్షపూరితంగా మూడు నెలలుగా బీఆర్ఎస్ కార్యకర్తలపై పలు గ్రామాల్లో అక్రమ కేసులు పెట్టి చిత్ర హింసలకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. ఎస్పీ నారాయణరెడ్డిని మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్పల్లిలో జరిగిన విషయమై అక్కడ సీఐతో మాట్లాడుతుండగా కాంగ్రెస్ నాయకులు అలజడి సృష్టించి గుండాయిజం, బెదిరింపులు చేస్తూ అక్కడ చేసిన అరాచకాన్ని అంత జరుగుతున్న పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాసి ప్రేక్షక పాత్ర వహించారన్నారు. విచారించి ఎస్ఐపై చర్యలుతీసుకొని జరిగిన ఘటన మీద విచారణ చేయాలని కోరారు.

చెరువుల్లో మురుగు కలవనివ్వొద్దు

● మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 24: పరిసరాల్లో ఉన్న చెరువుల్లో మురుగు కలవకుండా చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. చాలావరకు మున్సిపాలిటీలో మురికి నీరును స్థానికంగా ఉన్న మంచి నీటిచెరువుల్లో కలిపి చెరువులను కలుషితం చేస్తున్నారన్నారు. ఇదే సంస్కృతి గ్రామాల్లో కొనసాగటం దురదృష్టకరమన్నారు. పూర్వం తాగడానికి నీరందించిన చెరువులు ప్రస్తుతం మురికి కుంటలుగా మార్చి పరిసరాలను కలుషితం చేస్తుండటంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు చెరువులు, కుంటల కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేసిన పూడూరు, రాయిలాపూర్ గ్రామాల్లో రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి వాటిని అభివృద్ధి పరచాలన్నారు. అభివృద్ధి కోసం తన వంతు సాయం అందజేస్తానని తెలిపారు. కాగా మేడ్చల్‌లో అసంపూర్తిగా నిలిచిన రైల్వే అండర్‌పాస్ పనులు సత్వరం పూర్తయ్యేలా చూడాలని కౌన్సిల్ సభ్యులు ఎంపీని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఖర్చుల బడ్జెట్‌పై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించాలి

యాలాల, సెప్టెంబర్ 24 : పేదల నుంచి రూ.500లకు గ్యాస్, 200యూనిట్ల ఉచిత కరెంటుకు ప్రజాపాలన దరఖాస్తులు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. సీఎం, ఎమ్మెల్యే పథకాల అమలుకు ఆదేశాలు ఇస్తున్నా మండలస్థాయి అధికారులు లెక్క చేయడంలేదని ఆరోపించారు. పేదప్రజల బాధలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చినా పేదలకు సమాధానం చెప్పడం లేదన్నారు. తమ వద్ద సరైన సిబ్బంది లేరని చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పేదల పక్షాన పేదలందరినీ ఏకం చేసి పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కొప్పుల నర్సింహులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

స్వచ్ఛంద సంస్థకు విరాళాల సేకరణ



విరాళాలను అందజేస్తున్న విద్యార్థులు

కొడంగల్, సెప్టెంబరు 24: సోచ్ దివ్యాంగుల ఫౌండేషన్ హైదరాబాద్ వారికి కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం విరాళాలు సేకరించారు. మొత్తం రూ.23వేలు విరాళాలు సేకరించారు. పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటయ్య, ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, సంగీత, అరుణజ్యోతి, నాజీయా, ప్రభాకర్, సనా, మెహెరాజ్ బేగం పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజ సేవ చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 24: ప్రతీఒక్కరు ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజసేవ చేయాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ అర్చనా మాంత్రి అన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వలంటీర్లకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్లు విజయ్‌కుమార్, వసుధ భక్షి, అడ్మిషన్స్ డీన్ మహీపతి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఘట్‌కేసర్, సెప్టెంబరు 24: సీఎం సహాయనిధి పేదలకు వరమని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఐదుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కౌన్సిలర్ గోంగళ్ల మహేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ ముల్లి పావని

ఘట్‌కేసర్, సెప్టెంబరు 24: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చందుపట్లగూడ పులిచరకుంట కాలనీలో మంగళవారం రూ.5లక్షల స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. కొత్తకాలనీల్లోనూ ప్రజలకు తాగునీటిని అందించేందుకు పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. సీసీ, బీటీ రోడ్ల నిర్మాణంతోపాటు డ్రైనేజీల తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎండీ సాబేర్‌అలీ, కౌన్సిలర్లు బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజనేయులు గౌడ్, నర్సింగరావు, కోఆప్షన్ సభ్యుడు సౌకత్‌మియా, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాధాకృష్ణ, ఎం.వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, సిరాజ్, మహిళలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల కోసం ప్రజలు ఉద్యమించాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 24: ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు ఉద్యమించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి సబిత అన్నారు. పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్ శాఖా సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటికీ రుణమాఫీ ఎవరికి అవుతుందో, ఎవరికి కాదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. హైడ్రాపేరుతో పెద్దల ఆక్రమణలు తొలగిస్తున్న ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. అంతకు ముందు సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతికి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అలివేలు, నాగమణి, అరుణ, అనసూయ, రాజేశ్వరి, ఉమారాణి, సాయమ్మ పాల్గొన్నారు.

ఖోఖో, కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 24: జడ్పీహెచ్ఎస్ టేకులపల్లి పాఠశాల విద్యార్థులు అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీల్లో మొదటి స్థానంలో నిలవగా, బాలుర విభాగంలో విద్యార్థులు ఖోఖో పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. అథ్లెటిక్స్ విభాగంలో పరుగు పందెంలో బాలికలు, బాలురు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ సురేశ్, ఉపాధ్యాయులు సుధాకర్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పీడీఎస్ఐయూ నాయకులు

వికారాబాద్, సెప్టెంబరు 24: హైదరాబాద్‌లో అక్టోబరు 24న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ విద్యార్థులను కోరారు. వికారాబాద్ వికాస్ జూనియర్ కళాశాలలో మంగళవారం స్వర్ణోత్సవ సభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం పేరు మార్పు తగదు



జిల్లా కార్యవర్గ సభ్యులు అంజనేయులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 24: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్పు తగదని జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖాపురం ఆంజనేయులు మంగవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్యులు కావడం వల్లే పేరును తొలగిస్తున్నారని ఆరోపించారు. శ్రీరాములు త్యాగానికి ప్రతీకగా, భావితరాలకు తెలియజేయకుండా ప్రభుత్వం కనుమరుగు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెనక్కి తగ్గకపోతే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటారని తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

కులకచర్ల, సెప్టెంబరు 24: లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం కార్యదర్శి రాములుగౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు సహాయకులు కీలకం



మట్లాడుతున్న ఎంపీవో బాలరంగాచారి

బషీరాబాద్, సెప్టెంబరు 24: మంచి నీటి సరఫరాకు ఇకపై సహాయకుల పాత్ర కీలకం కానుందని బషీరాబాద్ ఎంపీవో బాలరంగాచారి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం(మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో చేపట్టిన తాగునీటి సహాయకుల శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మట్లాడుతూ.. గ్రామాల్లోని తాగునీటి సహాయకులకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చి మెరుగైన నీటి సరఫరాకు బాధ్యతలు అప్పగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో తాగునీటి వ్యవస్థ పనితీరుతో పాటు, నీటినాణ్యత పరిశీలన, బోర్లు పాడైతే మరమ్మతులు చేయడం, పైపులేన్ లీకేజీలు ఏమైన ఉంటే తాగునీటి సహాయకులు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యంతో వెంటనే సరిచేయాల్సి ఉంటుందని గుర్తుచేశారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఇంట్రా డీఈఈ తేజబాబు, మిషన్‌భగీరథ గ్రిడ్ డీఈఈ విజయ్‌కుమార్, ఏఈ సాయిప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసుకోవాలి



తాండూరు: పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్

శామీర్‌పేట, సెప్టెంబరు 24: సమాజం లోని ప్రతీఒక్కరు బాధ్యతగా ఇళ్ళలో, పరిసరాల్లో ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక పిలుపునిచ్చారు. తూంకుంట మున్సిపల్‌లో కమిషనర్ వెంకటగోపాల్ ఆదేశాల మేరకు మంగళవారం స్వచ్ఛసర్వేక్షణ్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై సారథి బృందం వారు ఎంతో ఆకర్షణీయంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

తాండూరు: ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి సాధ్యమవుతుందని కౌన్సిలర్ విజయదేవి రంగారావు అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సింధూ బాలికల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.75లక్షలతో పట్టణ అభివృద్ధి



మాట్లాడుతున్న చైర్మన్ ముకుంద అశోక్

పరిగి, సెప్టెంబరు 24: రూ.75లక్షలతో 14, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పరిగి పట్టణ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. పరిగి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, కుక్కల నియంత్రణ చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **బంట్వారం/తాండూరు రూరల్:** బంట్వారం మండల కేంద్రంలో సీడీపీవో ప్రవీణ మంగళవారం పోషణమాస ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, విద్యాధికారి చంద్రప్ప, ఎంపీడీవో రాములు పాల్గొన్నారు.తాండూరు మండలం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో కాంతారావు పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు నిర్మల, సుశీల పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని మోమిన్‌పేట్ ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బురుగుపల్లి, కాస్లాబాద్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

● **దోమ:** బీజేపీ సభ్యత్వ నమోదును పార్టీ కార్యకర్తలు వేగవంతంగా పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు వెన్న ఈశ్వరప్ప అన్నారు. అయినాపూర్‌లో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఒక్కో బూత్‌లో 200కంటే ఎక్కువగా సభ్యత్వాలు నమోదు చేయించాలని తెలిపారు.

● **కులకచర్ల:** అర్హులైన వారందరికీ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు అందుతాయని తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంగళవారం గ్యాస్ సబ్సిడీ గుర్తింపు పత్రాలు పంపిణీ చేశారు.

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేస్తున్న బోరు పనులకు మంగళవారం చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.

● **శామీర్‌పేట:** మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

● **మేడ్చల్ టౌన్/పరిగి:** బ్లూక్రాస్ సంస్థవారు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన పెంపెడు జంతువుల వ్యాక్సినేషన్ శిబిరాన్ని మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి ప్రారంభించారు. 367 పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. పరిగి పట్టణంలోని వీధి కుక్కలను పట్టుకొని వచ్చి కేంద్రంలో ఆపరేషన్‌లు నిర్వహించినట్లు పశువైద్యుడు ఆనంద్ తెలిపారు.

● **దౌల్తాబాద్:** తిమ్మారెడ్డిపల్లిలో సోమవారం రాత్రి ఎస్ఐ రవిగౌడ్ ఆధ్వర్యంలో కళాజాత బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, డయల్ 100, ట్రాఫిక్ నిబంధనలు, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం మాజీ ఎండీ మజ్జిగ కరుణాకర్ అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి మంగళవారం జిల్లా సహకార సంఘం అధికారికి ఫిర్యాదు చేశాడు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



కడా ప్రత్యేకాధికారికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 24: బొంరాస్‌పేట్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో మంగళవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగులయ్య, హరీశ్, సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి

దోమ, సెప్టెంబరు 24: రైతులకు వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించాలని డీబీఎఫ్ జిల్లా నాయకుడు సిద్దిఈశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్సిడీపై రైతులకు విత్తనాలు అందిస్తే మేలు జరుగుతుందన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ఉరేసుకుని ముగ్గురి ఆత్మహత్య

వికారాబాద్, సెప్టెంబరు 24: వేర్వేరు చోట్ల ఉరేసుకుని ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలు వికారాబాద్, శామీర్‌పేట్, పరిధిలో చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ మండల పరిధికి చెందిన మోముల శ్రీకాంత్‌కు సదాశివపేటకు చెందిన మంగమ్మ(23)తో మూడు సంవత్సరాల కిందట వివాహమైంది. వారికి సంవత్సరంన్నర కూతురు ఉంది. శ్రీకాంత్ వ్యవసాయం చేసుకుంటూ ట్రాక్టర్ నడిపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మంగళవారం ఉదయం మంగమ్మ ఇంట్లో పనులు చేసుకుని ఇంట్లో పూజ కార్యక్రమాల అనంతరం ఇంట్లో ఎవరూ లేనిది చూసి ఉరేసుకున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా వారికి ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. అదేవిధంగా శామీర్‌పేట్ గ్రామానికి చెందిన ఉమేశ్‌చంద్ర(22) వృత్తిరీత్యా టెంపరరీ డ్రైవర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడం ఆపై అనారోగ్యానికి గురికావడంతో మనోవేదనకు గురయ్యాడు. సోమవారం బయటకి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చి తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. మర్నాడు ఉదయం చందు నిద్రలేవకపోయేసరికి ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో జగ్గంగూడకు చెందిన రాయి మల్లేష్(42) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా తన ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జన్మదిన వేడుకల పేరుతో వృద్ధురాలిపై దాడి

● బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 24: జన్మదిన వేడుకల పేరుతో వృద్ధురాలిపై దాడి చేసి బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగ్గంగూడకు చెందిన చెవ్వ రాములమ్మ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈక్రమంలో వారం రోజుల కిందట ఒక కుటుంబం తమకు ఉండడానికి ఇళ్లు కిరాయికి కావాలని రాములమ్మను అడిగారు. దీంతో తన ఇంటి ముందు ఖాళీగా ఉన్న ఇంటిని కిరాయికి ఇప్పించింది. ఇంత వరకు బాగానే ఉన్నా కిరాయికి వచ్చిన వారి కళ్లు రాములమ్మ ఒంటిపై ఉన్న నగలపై పడ్డాయి. పథకం ప్రకారం పుట్టిన రోజు వేడుక పేరుతో సదరు కుటుంబం రాములమ్మను తమ ఇంటికి ఆహ్వానించారు. రాములమ్మకు మద్యం తాగించి, మద్యం మత్తులో ఉన్న ఆమె నోట్లో గుడ్డలు కుక్కి దాడిచేశారు. ఆమె ఒంటిపై ఉన్న సుమారు ఏడు తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. స్పృహలోకి వచ్చిన రాములమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆమెను ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆరు నెలల కిందట రాములమ్మ కోడలు పుస్తెలతాడు అపహరణకు గురైంది. ఆ ఘటన నుంచి తేరుకోక ముందే రాములమ్మపై దాడి జరగడం ఆ కుటుంబాన్ని కలవరపెడుతోంది.

ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తి మృతి

యాలాల, సెప్టెంబరు 24: ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాలాల ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు-హైదరాబాద్ రోడ్డుమార్గంలోని ఇందిరమ్మ కాలనీలో మహ్మద్‌అలీ(36) కుటుంబసభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. గత 15రోజుల కిందట భార్యాభర్తల మధ్య కుటుంబ తగాదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో మృతుడు అలీ భార్య పర్వీన్ బేగం పది రోజుల నుంచి తన ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. మూడు రోజులుగా మహ్మద్‌అలీ ఎక్కడా బయట కనిపించలేదు. మంగళవారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల గల కాలనీవాసులు ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా మహ్మద్‌అలీ మృతిచెంది ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 24: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నూతన్‌కల్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూతన్‌కల్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి వినీత్‌గుప్తా(16) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం తన ఇంటికి ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తు తగలడంతో మృతిచెందాడు. మంగళవారం ఉదయం తన ఇంటి మొదటి అంతస్తులోని కిటికీ ఐరన్ గ్రిల్స్ అమర్చడానికి వెళ్లి అక్కడే ఉన్న ఇనుప రాడ్లను తొలగించే క్రమంలో ఓ రాడ్డు ఇంటికి ఆనుకుని ఉన్న 11కేవీ విద్యుత్ తీగలకు తాకింది. దీంతో వినీత్‌కు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



హేమంత్‌కుమార్ (ఫైల్)

కీసర రూరల్, సెప్టెంబరు 24: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య వివరాలిలా ఉన్నాయి. సురమ్ హేమంత్‌కుమార్ అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో నివాసముంటున్నాడు. కాగా పని నిమిత్తం బయటికి వెళ్తున్నానని చెప్పి ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి బయల్దేరాడు. కాగా తన పిల్లలను, తల్లిని బాగా చూసుకోవాలని ఉదయం 9గంటలకు తన భార్య ఫోన్‌కు మెసేజ్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. బంధువులు, మిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో భయాందోళనకు గురైన అతడి భార్య సురమ్ లత కీసర పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మోమిన్‌పేట్, సెప్టెంబరు 24: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మోమిన్‌పేట్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి భార్య లక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టేకులపల్లికి చెందిన మన్నె రాములు (53) మంగళవారం ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయమ్మ చెరువు అలుగు దాటుతున్న క్రమంలో కాలుజారి చెరువులో పడటంతో ఆయనకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సాయి, ప్రసాద్ ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

వివాదాస్పద స్థలంపై హైకోర్టు స్టే

తాండూరు, సెప్టెంబరు 24: తాండూరు పట్టణం సర్వే నెంబర్ 51లోని వివాదాస్పద స్థలంపై హైకోర్టు స్టే విధించిందని జీపీఏ హోల్డర్ అబ్దుల్ రజాక్ తరుపు న్యాయవాది కె.గోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రోడ్డు మార్గంలోని సర్వే నంబర్ 51, 5 సర్వేనంబర్ల విషయంలో వివాదం ఏర్పాడిన సంగతి తెలిసిందే. సర్వే నెంబర్ 51లో కట్కుం వీరేందర్ అనే వ్యాపారి మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారని హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు న్యాయ స్థానం వివాదాస్పద స్థలంలో నిర్మాణ పనులు నిలిపి వేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు న్యాయవాది గోపాల్ వెల్లడించారు. అదే విధంగా ఇట్టి నిర్మాణ పనుల వద్ద పోలీసులు ఉండి సహకరించడంపై కోర్టు ప్రశ్నించినట్లు ఆయన వివరించారు.